క్లుప్తంగా

కొమరాడలో ఎక్సైజ్ దాడులు

భీమవరం: మండలంలోని కొమరాడ గ్రామంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న పూరిళ్ల నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు శుక్రవారం చెప్పారు. నాగేశ్వరరావును 6 మద్యం సీసాలతో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సెల్: 94409 02439 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని బలరామరాజు తెలిపారు. అలాగే ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

23,24 తేదీల్లో డీఎన్నార్‌లో ఈశా గ్రామోత్సవం

భీమవరం: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఈనెల 23,24 తేదీల్లో ఈశా గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ భారత స్ఫూర్తిని పునరుజ్జీవించచేయడానికి క్రీడలను మాధ్యమంగా ఎన్నుకున్నామని ఈ గ్రామోత్సవానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. దీనిలో భాగంగా పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ క్రీడలతో పాటు గ్రామీణ ఆటలు, సాంప్రదాయ కళలు పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

ఉండి: భర్త వేధింపులను భరించలేని భార్య భర్తపై ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం మహదేవపట్నం శివారు రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన బొప్పన శ్రీనివాస్ లక్ష్మీదుర్గలకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి మద్యానికి బానిసై ప్రతి రోజు తాగి వచ్చి తన భార్య లక్ష్మీదుర్గను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఇదే క్రమంలో ఈ నెల 19వ తేదీ మంగళవారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో భార్యను చిత్రహింసలకు గురిచేయడంతో పాటు కొట్టి గాయపర్చాడు. దీంతో సహించలేని భార్య తన భర్తపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా మావుళ్లమ్మను శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. తొలుత వారికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: పోడూరు మండలం గుమ్మలూరుకు చెందిన కొత్తకోట శ్రీను అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇంటింటి సర్వేల్లో ఏఎన్ఎంలను మినహాయించాలి

పాలకొల్లు అర్బన్: పంచాయతీ, వార్డ్ హెల్త్ సెక్రటరీ గ్రేడ్–3 ఏఎన్ఎంలుగా పని చేస్తున్న ఉద్యోగులకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్వహించే వివిధ ఇంటింటి సర్వేల నుంచి మినహాయింపు ఇవ్వాలని సచివాలయ ఏఎన్ఎంల జిల్లా సంఘ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఎంపీడీవో ఎస్ఎస్ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఒకవైపు ఆరోగ్యశాఖ సర్వేలతో పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీంతో పాటు పంచాయతీరాజ్ శాఖ నిర్వహించే ఇంటింటి సర్వేలు వేయడం పని భారమవుతుందన్నారు. సచివాలయ ఏఎన్ఎంలు ఆర్.భాగ్యలక్ష్మి, ఎం.సుధారాణి, జి.శిరీష, డి.సరళాప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


దళారులను నమ్మి మోసపోవద్దు

ఇరగవరం: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో మాత్రమే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయాధికారి రాఘవేంద్రరావు రైతులకు సూచించారు. శుక్రవారం ఇరగవరం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ ఖరీఫ్ సజన్‌కు సంబంధించి 13.347ఎకరాల్లో వరి పంట సాగు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గోనె సంచులు సిద్ధంగా ఉంచామన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడో?

- ఇసుక లభ్యం కాక నిలిచిన నిర్మాణాలు
- పనులు లేక లబోదిబోమంటున్న కార్మికులు
- ఇసుక వెతుకులాటలో నిర్మాణదారులు





ఇసుక అందుబాటులోకి రాక మధ్యలో నిలిచిన భవనాలు

వీరవాసరం: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ఆర్భాటంగా తీసుకొచ్చింది. అయితే అనుకున్న రీతిగా ఇంటి నిర్మాణదారులకు ఇసుక లభ్యం కాక ఇంటి నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇసుక బ్లాక్ మార్కెట్ అవుతుందని పలువురు నిర్మాణదారులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఐదు టన్నులు ఇసుక రూ.18 వేల నుంచి 25వేలకు విక్రయిస్తున్నారు. సాధారణ, మధ్య తరగతి గృహ నిర్మాణదారులు ఇంత పెద్ద మొత్తం వెచ్చించి ఇసుక కొనుగోలు చేయలేక నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే మరో పక్క ఇంటి నిర్మాణాలు ముందుకు సాగక ఈ రంగంపై ఆధారపడిన కార్మికులు లబోదిబోమంటున్నారు. పూట గడవటమే కష్టంగా మారుతుందని వాపోతున్నారు. అలాగే నిర్మాణరంగంపై ఆధారపడిన అనుబంధ రంగాల వారి పరిస్థితి ఇదే మాదిరిగా ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఇసుక అందుబాటులోకి వస్తుందని అధికారులు చెప్పిన మాటలు సైతం నీటి మీద రాతల్లా మారాయని నిర్మాణదారులు వాపోతున్నారు. మరో పక్క ఇసుక బుకింగ్‌కు సంబంధించి ఆన్‌లైన్ సైట్లు సైతం తెరుచుకోవడం లేదని గగ్గోలు పెడుతున్నారు.

పనులు లేక అప్పుల పాలు

ఇసుక పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. దీంతో పనులు లేక పూటగడవని పరిస్థితి. అప్పుల వారికి సమాధానం చెప్పలేని పరిస్థితి. తీసుకున్న అప్పులను తిరగేస్తే ప్రస్తుత పరిస్థితుల్లో కట్టగలమా ? అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుకను అందుబాటులోకి తేవాలి.

– జె.రామకృష్ణ, సెంటరింగ్ కార్మికుడు, భీమవరం

ఎన్నికల నాటి నుంచి అరకొర పనులే

సాధారణ ఎన్నికల కోడ్ నుంచి భవన నిర్మాణరంగంలో అరకొర పనులు మాత్రమే లభిస్తున్నాయి. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం ఆన్‌లైన్ బుకింగ్‌ను గాడిలో పెట్టకపోవడంతో నేటికీ చేతి నిండా పని లేని పరిస్థితి. నిర్మాణరంగం మనుగడను కాపాడాలి.

– జెట్టి శివ, తాపీ మేస్త్రీ, భీమవరం.

దీపం-2 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో భాగంగా దీపం – 2 పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 31వ వార్డు దుర్గాపురంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దీపం పథకం-2లో ఉచిత గ్యాస్ సిలిండర్ పొందిన సుమారు పదిమంది లబ్ధిదారుల కుటుంబాలను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ. 876 ఉందని, దీనిలో రూ. 25 రాయితీ, మిగిలిన రూ. 851లు విడివిడిగా జమవుతాయని తెలిపారు. మీ ప్రాంతంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యం, కందిపప్పు, పంచదార కార్డుదారులందరు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం తహసీల్దార్ రాంబాబు, ఆర్.ఐ ఎ.సురేష్ తదితరులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలకు ఐక్యపోరాటాలు అవసరం



భీమవరం సీఐటీయూ సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వి గోపాలన్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. శుక్రవారం భీమవరం సీఐటీయు కార్యాలయంలో ఎస్ సిరీస్ అధ్యక్షతన జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులపై దాడిని తీవ్రతరం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలు సవరిస్తూ యాజమాన్యాలకి ఉపయోగపడే విధంగా చట్టాల మార్పును తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. విశాఖ ఉక్కు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్నారని దాని ద్వారా నిరుద్యోగం పెంచుతున్నారని వాపోయారు. ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని, రానున్న రోజుల్లో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ సమావేశంలో బి వాసుదేవరావు, కలిపిండి సత్యనారాయణ, కోర్ల వెంకటేశ్వరరావు, సామంతుల ఉదయ భాస్కరరావు, బంగారు వరలక్ష్మి, రాజేశ్వరి, బి విజయలక్ష్మి, డి నాగు, నిలాపు రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవు



ధాన్యం కొనుగోలుపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ ప్రియాంక

ఆకివీడు: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని ఏఓ ప్రియాంక పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ధాన్యం కొనుగోలుపై మిల్లర్లు, రైతులు, టెక్నికల్ అధికారులతో సమావేశం జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులు ఏ మిల్లుకైనా ధాన్యాన్ని స్వేచ్ఛగా అమ్ముకోవచ్చునన్నారు. మద్దతు ధరకన్నా తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తే రైతులు మండల వ్యవసాయ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మద్దతు ధరకన్నా తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసినా, ధాన్యం కొనుగోలులో రైతుల్ని ఇబ్బందులకు గురిచేసినా ఆయా రైస్‌మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తూకం, తేమ శాతం సక్రమంగా ఉండేందుకు ఆయా మిషన్లను శుభ్రపరచాలన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సంచులు చినిగినా, నాసిరకంగా ఉన్నా మార్చుకునే అవకాశం ఉందని చెప్పారు. ఏడీఏ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యంలో తేమ శాతం తగ్గించే విధంగా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి మిల్లులకు రవాణా చేయాలన్నారు. కాటాలో 600 గ్రాములు అధికంగా ధాన్యం ఉండే విధంగా తూకం ఉండాలని చెప్పారు. సమావేశంలో పలువురు రైస్ మిల్లర్లు మాట్లాడుతూ యంత్రాల ద్వారా మాసూళ్లు చేస్తున్నందున ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంటుందన్నారు. అటువంటి ధాన్యం కొనుగోలు చేయడం వల్ల దిగుబడి తగ్గి, ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో బియ్యం చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఆరబెట్టిన ధాన్యంను మిల్లులకు చేరే విధంగా రైతులు కృషి చేయాలన్నారు. నాణ్యమైన ధాన్యం సేకరించేందుకు తమకు ఏవిధమైన ఇబ్బంది లేదన్నారు. తేమ శాతం అధికంగా ఉన్న ధాన్యాన్ని తిప్పి పంపితే రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆ స్థితి తీసుకురావద్దని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో స్పెల్లింగ్ నాలెడ్జ్ పోటీలు



ఎస్ఆర్‌కేఆర్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్‌డీ, సీఎస్‌ఐటి విద్యార్థులు స్వయంగా తయారు చేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా స్పెల్లింగ్ నాలెడ్జ్ సామర్థ్యాన్ని మూడు రౌండ్ల కాంటెస్ట్ ద్వారా పరీక్షించి 10 మంది విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసినట్లు కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు చెప్పారు. శుక్రవారం విజేతలకు బహుమతులు అందజేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలను నెలరోజుల పాటు క్యాంపస్‌లో నిర్వహించగా తమ కళాశాలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విజేతలకు రూ.25 వేల విలువ గల స్మార్ట్ వాచెస్, వీఆర్‌హెడ్ సెట్స్, హెడ్ ఫోన్స్ వంటివి బహుమతులుగా అందజేశారు. వారిలో మొదటి బహుమతి విజేతగా తమ్మ జయరామరాజు ×స్పెల్బీ చాంపియన్ 2024 గా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, ఐడియా ల్యాబ్ హెడ్ నూకల గోపాలకృష్ణమూర్తి, సీఎస్‌డి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ముదునూరి సురేష్ బాబు, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా లక్షపత్రి పూజ



లక్షపత్రి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

పెనుగొండ: కార్తీకమాసం సందర్భంగా పెనుగొండలో ప్రసిద్ధి గాంచిన శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం లక్షపత్రి పూజ వేడుకగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు ఆలయ అర్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేద పండితుడు రామడుగుల నరసింహమూర్తి, అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద పండితులు మునుకుట్ల రామలింగేశ్వరరావు సూర్య నమస్కార పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లురావు పర్యవేక్షించారు.

సీహెచ్‌సీలో పారిశుద్ధ్య పనులకు కసరత్తు



సీహెచ్‌సీ వద్ద ప్లంబర్ పనులను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీనివాసరాజు

ఆకివీడు: స్థానిక సీహెచ్‌సీలో పారిశుద్ధ్య పనులకు కసరత్తు చేపట్టారు. ఆస్పత్రి ఆవరణలోని పిచ్చి మొక్కల్ని శానటరీ సిబ్బందితో తొలగిస్తున్నారు. దోమల బెడదకు ఎప్పటికప్పుడు దోమల మందు కొట్టాల్సి ఉంది. అయితే పెస్ట్‌కంట్రోల్ సిబ్బందితో వేరే పనులు చేయించడంతో దోమలు, చెదల మందు కొట్టేవారే లేకపోయారు. వార్డులలోని కిటికీలకు ఉన్న మెస్‌లను శుభ్రపరచాల్సి ఉండగా ఆ పనుల్ని కూడా చేపట్టడం లేదు. ఆసుపత్రి ఆవరణ పల్లమైపోయిందని, ఆసుపత్రి చుట్టూ మట్టి పూడ్చాల్సి ఉందని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గణేశ్వరరావు చెప్పారు. ఆవరణలోకి ట్రాక్టర్ వచ్చే అవకాశం లేదన్నారు. మట్టి పూడికకు తగినన్ని నిధులు లేవని చెప్పారు. మట్టి పూడిక, డ్రెయినేజీ సౌకర్యం మెరుగు పరచేందుకు ఎమ్మెల్యే రఘురామరాజు దృష్టికి తీసుకువెళ్లతామని గణేశ్వరరావు చెప్పారు. నూతన భవనం త్వరలో ప్రారంభించేందుకు చేయాల్సిన చిన్న చిన్న పనుల్ని త్వరిత గతిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. శుక్రవారం కన్‌స్ట్రక్షన్ డీఈఈ శ్రీనివాసరాజు ఆయ పనులు చేయిస్తున్నారన్నారు. మరుగుదొడ్లకు, వాషింగ్ బేసిన్‌లకు పైప్‌లైన్ల నిర్మాణ పనులు చేపట్టారని గణేశ్వరరావు తెలిపారు. నాలుగైదు రోజుల్లో పనులు పూర్తి చేసి వారంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాసరాజు, వైద్యురాలు భువన పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై అవగాహన



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ జగదీశ్వరరావు

ఉండి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా ప్రాముఖ్యమని ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉండి ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక వ్యాపారులు, ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. దుకాణాలు, గృహ సముదాయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలు జరిగే అవకాశం తగ్గుతుందన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఎలా ఉపయోగపడ్డాయో పలు సంఘటనలను ప్రజలకు తెలియపరిచారు. నేరాలు జరిగిన సమయంలో ఎంతో ఎక్కువ మొత్తాన్ని ప్రజలు గానీ వ్యాపారులు గానీ కోల్పోతున్నారని తెలిపారు.అదే సమయంలో సీసీ కెమెరాలు అందుబాటులో ఉంటే నేరానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించడంతో పాటు పాగొట్టుకున్న సొమ్మును అత్యంత వేగంగా రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కాబట్టి ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ పులగం శ్రీనివాస్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

మొగల్తూరు: మండలంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. రామన్నపాలెం పంచాయతీ–2 రైతు సేవా కేంద్రం, మొగల్తూరులోని మూడో సచివాలయ పరిధిలోని రైతుసేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు అవసరమయ్యే గోనె సంచులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తుందని, కల్లాల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేర వేసేందుకు అయ్యే రవాణా ఖర్చులను కూడా ప్రభుత్వమే రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కోలమూరులో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఉండి: ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డీ మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉండి మండలం యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కోలమూరు గ్రామంలో పర్యటించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ అంటువ్యాధులు రాకుండా ప్రజలంతా జాగ్రత్తలు, పరిశుభ్రత పాటించాలని అన్నారు. ముఖ్యంగా జ్వరాల భారిన పడకుండా ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలని అన్నారు. వారంలో ఒకరోజు నీరు నిలువ ఉండే పాత్రలను పూర్తిగా ఖాళీ చేసి వాటిని ఆరబెట్టాలని తెలిపారు.అలాగే వర్షపు నీరు గాని వాడకం నీరు గాని ఎక్కువకాలం నిలువ లేకుండా చూడాలన్నారు. ఏదైనా పాత్రలుగాని, కొబ్బరిబొండాలు, టైర్లు, ఇతర వేస్ట్ సామాన్లులో నీరు నిలువ ఉండటంతో వాటిలో దోమలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. దోమలు వ్యాప్తితో ప్రజలు మలేరియా తదితర జ్వరాల భారిన పడే అవకాశం ఉందన్నారు. అందుకే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీసారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియాధికారి డా. గులాబ్ రాజ్ కుమార్, యండగండి పీహెచ్‌సీ వైద్యాధికారి డా. డీ బెన్నీసామ్యూల్స్, వైద్యాధికారులు భాస్కోరరావు, ఎస్ సుభాకర్, వీ అరుణ్‌కుమారి, బీ లక్ష్మీ, ఆశవర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఏం కొనలేం.. తినలేం!

- కూటమి సర్కారు బాదుడే.. బాదుడు
- పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజల బెంబేలు



కూరగాయల దుకాణం

యలమంచిలి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నిత్యావసర సరుకుల ధరల పెంపుతో ప్రజలను బాదుతోంది. ఈ ప్రభుత్వంలో అన్ని వస్తువుల ధరలు పెరిగాయని ప్రజలు విమర్శిస్తున్నారు. కూరగాయలు, వంట నూనెలు, పప్పు దినుసులు ఇలా అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో సగటు సామాన్యుడు ఏం కొనేట్టు లేదు, ఏం తినేట్టు లేదని సామాన్యులు వాపోతున్నారు. చాలీచాలని జీతాలతో మధ్యతరగతి వారితోపాటు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కార్మిక, కర్షక ప్రజలు ఈ ధరల బాదుడికి బెంబేలెత్తిపోతున్నారు. సంపాదించే మొత్తం నిత్యావసర వస్తువులకే సరిపోతుంటే కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా రోజువారీ సంపాదనపై ఆధారపడి జీవించే వారి పరిస్థితి దుర్భరంగా మారింది. రోజు రోజుకూ పెరుగుతున్న ధరలను నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

కూరగాయల ధరలతో జేబు ఖాళీ

మార్కెట్లో కూరగాయల ధరలు సామాన్యుడు కొనే పరిస్థితి కనబడడం లేదు. ఉల్లిపాయల దగ్గర నుంచి అన్ని రకాల కూరగాయల ధరలు కిలో రూ.50కు పైబడి ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ వారం పాలకొల్లు సంతలో అమ్మిన ధరలను ఒకసారి పరిశీలిస్తే ఈ విధంగా ఉన్నాయి. చిక్కుడు రూ.80, క్యారెట్ రూ.60, మునక్కాయ రూ.10, ఉల్లిపాయలు రూ.60, టమోటా రూ.60, అల్లం రూ.60, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.60, బీట్‌రూట్ రూ.60 పలికాయి.

చుక్కల్లో వంట నూనె

ఒక్క కూరగాయలే కాదు కిరాణా సరుకుల ధరలు కూడా గడచిన నాలుగు నెలల కాలంలో 10 నుంచి 20 శాతం పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో వంటనూనెల ధరలు అమాంతం పెరిగాయి. గతంతో పోల్చితే లీటరు ఆయిల్‌పై రూ.30 పెరిగింది. దిగుమతి సుంకం పెరగడంతో ఆయిల్ ధరలు పెరిగాయంటూ వ్యాపారులు చెబుతున్నారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

మండిపోతున్న నిత్యావసరాల ధరలు మాలాంటి మధ్య తరగతి ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రభుత్వం మధ్యం తక్కువ ధరలకు అమ్మడం వలన ప్రజలకు ఉపయోగం లేదు. నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు అమ్మితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– బాలం అంజిబాబు, రైతు, మేడపాడు

గోతుల రోడ్లకు మరమ్మతులు చేయాలి



భీమవరంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో గోతులుపడ్డ రోడ్లను వెంటనే నిర్మాణం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం భీమవరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి పాడైపోయిన రోడ్లను మరమ్మతులు చేయాలన్నారు. రోడ్లు గోతులు మయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణీకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలో పాడైన రోడ్లను వెంటనే నిర్మాణం చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని వాసుదేవరావు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి

పెనుగొండ: ఉపాధి కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు ఉన్నతి కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా 3 నెలలు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, రూ.3000 అందిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని ధర్నా నిర్వహించారు. అనంతరం సర్పంచ్ కాసాని విజయలక్ష్మీపెద్దిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఉన్నతి కార్యక్రమం కొన్ని కుటుంబాలకే పరిమితం చేయకుండా ఉపాధి పని చేసే ప్రతీ కుటుంబానికి వర్తింప చేయాలన్నారు. ఏపీలో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు.